మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇక్కట్లు



మూత్రశాల, మరుగుదొడ్డి లేని మోమిన్‌పేట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల

వికారాబాద్, జనవరి 16 : పాఠశాలలకు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించండి సారూ ... అంటూ ఆయా పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోమిన్‌పేట మండల పరిధిలోని మోమిన్‌పేట జిల్లాపరిషత్ బాలుర పాఠశాల, బూర్గుపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, ఎన్కతల, టేకులపల్లి తదితర ప్రభుత్వ పాఠశాలల్లో మూత్ర శాలలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోమిన్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 171 మంది విద్యార్థులు ఉన్నారు. బూర్గుపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారు. వీరికి మరుగుదొడ్లు లేక పోవడంతో పాఠశాల ఆవరణలో బహిరంగ మల మూత్ర విసర్జనను చేస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికై దాదాపుగా సంవత్సరం గడుస్తున్నా ఇప్పటి వరకు పాఠశాలల్లో మూత్ర శాలలు ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పాఠశాలలను సందర్శించి.. సాధ్యమైనంత త్వరగా మూత్ర శాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మర్పల్లి, జనవరి 16: గ్రామ దేవతల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మోమిన్‌పేట్ సీఐ నవీన్ కుమార్ సూచించారు. మండలంలోని బుచన్‌పల్లి గ్రామంలో శుక్రవారం నుంచి ఆది వారం వరకు నిర్వహించే గ్రామ దేవతల ఉత్సవాల సందర్భంగా గురువారం రాత్రి మర్పల్లి ఎస్సై సురేశ్‌తో కలిసి గ్రామస్తులతో మాట్లాడారు. ఉత్సవాలను గ్రామంలో అందరూ కలిసి మెలసి జరుపుకోవాలని, సైబర్ నేరలపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.. ఈ కార్యక్ర మంలో నాయకులు మధుకర్, రవీందర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్న కూతురుపై లైంగికదాడికి యత్నం

ఆదిబట్ల, జనవరి 16: కామంతో కళ్లు మూసుకు పోవడంతో ఓ కామంధుడు తన సొంత అన్న కూతురిపై కన్నువేశాడు. బాలికను లాడ్జికి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించిన ఘటన ఆదిబట్ల పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇబ్రాహీంపట్నం మండలం ఓ గ్రామానికి చెందిన అంజనేయులు ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటున్నాడు. గురు వారం సాయంత్రం గ్రామంలో ఉన్న తన స్వంత అన్న కూతురు (16)కి పుట్టిన రోజుకు బట్టలు ఇప్పిస్తానని తన అన్నకు చెప్పి బాలికను ఓయో రూముకు తీసుకెళ్లాడు. అక్కడ ఆ బాలికపై లైంగిక దాడికి యత్నించడంతో ఆ బాలిక తప్పించుకుని బయటికి ఏడుస్తూ పరుగులు తీసింది. ఈ విషయాన్ని స్థానికులకు చెప్పడంతో వెంటనే ఆదిబట్ల పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో వెంటనే ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్‌లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్.- అబిడ్స్, జనవరి 16

మాదకద్రవ్యాలు విక్రయం.. యువకుల అరెస్టు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 16: కేపీహెచ్‌బీ కాలనీలో మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ముగ్గురు యువకులను అరెస్ట్ చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీ హెచ్‌బీ కాలనీలోని విశ్వనాథ్ థియేటర్ సమీపంలో కొందరు మాదకద్రవ్యాలు(బ్రౌన్ షుగర్) విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అను మానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా... వారి వద్ద బ్రౌన్ షుగర్ ప్యాకెట్లు లభించాయి. వారిలో మెదక్ జిల్లా బ్రాహ్మణపల్లికి చెందిన కలాలి నాని(25) మాంగల్యలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తూ.. ఎల్లమ్మబండలో నివసిస్తున్నాడు. జగద్గిరిగుట్టలోని బీర ప్పనగర్‌కు చెందిన కుర్వ ప్రకాశ్(30) రాపిడో డ్రైవర్‌గా, జగద్గిరిగుట్టకు చెందిన నవీన్‌కు మార్(30) మొబైల్‌షాప్‌లో పనిచేస్తున్నారు. వీరు ముగ్గురు కలిసి ఎల్లమ్మబండకు చెందిన బండా వరుణ్ అనే వ్యక్తి వద్ద రూ.14వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించి... 2 గ్రాముల బ్రౌన్‌షుగ ర్‌ను కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ ముగ్గురిని అదుపులోని తీసుకుని 2 గ్రాముల బ్రౌన్‌షుగర్‌ను, ఒక బైక్‌ను, నాలుగు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

సర్వే పనులు ప్రారంభం

- గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు
- వ్యవసాయేతర భూముల వివరాల సేకరణ



పరిగి: వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో వాసుచంద్ర

కొడంగల్: అధికారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్

పరిగి, జనవరి 16: రైతు భరోసాకు సంబంధించి వ్యవసాయేతర భూముల వివరాల పరిశీలన కార్యక్రమం గురువారం పరిగి మండలం నస్కల్ గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర ఈ కార్యక్రమాన్ని స్వయంగా తనిఖీ చేసి వివరాలు తెలు సుకున్నారు. గ్రామంలో వ్యవసాయేతర భూముల వివరాలు పక్కాగా సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా అమలులో భాగంగా అధికారులు సర్వే పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా గురు వారం క్షేత్రస్థాయి అధికారులతో సమావేశమై రేషన్ కార్డులు, రైతు భరోసా భూముల సర్వేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌లు రేషన్ కార్డుల సర్వే సిబ్బంది తో సమావేశమై చేపట్టాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల స్థితి గతు లను పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలన్నారు.

అదేవిధంగా రైతు భరోసాపై క్షేత్రస్థాయిలో తహసీల్దార్‌తో పాటు ఏడీఏ శంకర్‌రాథోడ్ సిబ్బందితో పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం సాగులో ఉన్న భూములకే రైతు భరోసా అందుతుందన్నారు. క్షేత్రస్థాయిలో పర్య టించి పంట భూములను పరిశీలించారు. అదేవిధంగా దుద్యాల మండ లంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కిషన్, ఏవో హిమ బిందులు డిప్యూటీ తహసీల్దార్, ఏఈవోలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేసి సర్వే పనుల విధివిధానాలపై అవగాహన కల్పించారు. పకడ్బందీగా సర్వే పూర్తి చేయాలని అదేశించారు.

కులకచర్ల: మండల కేంద్రంలోని గ్రామ పరిధి లో ఉన్న వ్యవసాయేత భూములను గుర్తించేందుకు రెవెన్యూ అధికా రులు సర్వేను నిర్వహిస్తు న్నారు. ఈ నెల 26 నుంచి పథకాలను అమ లు చేసేందుకు ప్రభుత్వం అధికారులను సర్వే చేసి దాని ఆధారంగా అర్హులైన రైతులను గుర్తిం చాలని ఆదేశాలు జారీ చేయడంతో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో వ్యవ సాయేతర భూముల సర్వేను రెవెన్యూ సిబ్బంది నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గ్రామ కంఠం పరిధిలో ఉన్న భూములు, సాగుకు యోగ్యత లేని భూములు, శిఖం భూములు, రియల్‌ఎస్టేట్‌కు సంబంధించిన భూములను గుర్తించేందుకు ఈ సర్వేను నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. వ్యవసాయానికి యోగ్యం కాని భూములను గుర్తిం చి రైతు భరోసాను నిలిపివేసేందుకు సర్వేను నిర్వహిస్తున్నారు.

బషీరాబాద్: తహసీల్దార్ వెంకటేశ్ ఆధ్వర్యంలో రెండు టీంలు, మం డల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో రెండు టీంలు ఏర్పడి వ్యవ సాయ, వ్యవసాయేతర భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అలాగే కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగార్జున రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, సర్వేయర్ ప్రభు పాల్గొన్నారు.

దోమ: మండల పరిధిలోని దోమ, తిమ్మాయిపల్లి, మోత్కూర్ తదితర గ్రామాల్లో వ్యవసాయేతర భూములు, వెంచర్లు, ప్లాట్లు సర్వేనంబర్ల ఆధారంగా గుర్తిస్తున్నట్లు తహసీల్దార్ పురుషోత్తం తెలిపారు. కార్యక్ర మంలో ఏవో ప్రభాకర్‌రావు, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధారూరు: మండల పరిధిలోని ధారూరుస్టేషన్ గ్రామ సమీపంలోని రాఘవేంద్ర రైస్‌మిల్ ఉన్న ప్రాంతాన్ని గురువారం తహసీల్దార్ షాజిదాబేగం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆమె వెంట వ్యవసాయ విస్తరణ అధికారి సంజుమ్ రాథోడ్, తదితరులు ఉన్నారు.

బషీరాబాద్:క్యాబ్గిరా లో గనులను పరిశీలిస్తున్న తహసీల్దార్

కులకచర్ల: సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పోలీసుస్టేషన్‌లో పర్యవేక్షణ కరువు

ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్

- నెలరోజులకు పైగా ఖాళీగా పట్నం సీఐ కుర్చీ
- మరోవైపు పెరుగుతున్న కేసులు..

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 16 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రమైన ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో సీఐ కుర్చీ ఖాళీగా ఉండ టంతో ఇబ్బందులు తప్పటంలేదు. నిత్యం పోలీసు స్టేషన్‌కు వచ్చే కేసుల పురోగతిని పర్యవేక్షించటం కరువైంది. దీని ప్రభావం నేరాల నియంత్రణపై పడే అవకాశముందని స్థానిక ప్రజలు అభిప్రాయపడు తున్నారు. గత డిసెంబర్ నెలలో కానిస్టేబుల్ నాగమణి హత్యకేసును ఛేదించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ఇక్కడ గతం లో పనిచేసిన సీఐ సత్యనారాయణను డిసెంబర్ నెల 11న కమిష నర్‌రేట్‌కు అటాచ్ చేస్తూ రాచకొండ సీసీ ఉత్తర్వులు జారీచేశారు. అప్పటినుంచి ఇబ్రహీంపట్నం సీఐ కుర్చీ ఖాళీగానే ఉంది. నిత్యం నిర్వహించాల్సిన పోలీసు కార్యచరణ భారమంతా అడ్మిన్ ఎస్సై మీదనే పడుతోంది. కేసులు పరిష్కరించటంలో తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ పరిధి లోకి మండలంలోని 14 గ్రామా లు, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి లోని 24వార్డులు, ఆదిబట్ల మున్సిపాలిటీలోని మూడు వార్డులు వస్తాయి. సుమారు 70వేల వరకు జనాభా ఉంది. నిరంతరం నాగా ర్జునసాగర్ జాతీయ రహదారిపై ఏదో ఒక్క చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి, అలాగే, ఈ ప్రాం తంలో ఇంజినీరింగ్ కళాశాలలు అధికంగా ఉండటంతో గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వాడకం కూడా అధికంగా పెరిగిపో యింది. అలాగే, పేకాట రాయుళ్లు, చోరీలు, హత్యలు, మోసాలు, అత్యాచారాల కేసులు సైతం ఇటీవల ఎక్కువగానే నమోదవుతున్నాయి. గత నెలరోజులుగా అధికంగా కేసులు నమోదయ్యాయని సమాచారం.

మంచాల సీఐకి అదనపు బాధ్యతలు..

ఇబ్రహీంపట్నం సీఐగా గతంలో పనిచేసిన సత్యనారాయణను కమిష నర్‌రేట్‌కు బదిలీ చేయటంతో ఈ ఠాణా అదనపు బాధ్యతలను మం చాల సీఐ మధుకు అప్పగించారు. మంచాల మండలంలో కూడా కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో అక్కడ, ఇక్కడ కేసులు చూసేందుకు తలకు మించిన భారమవుతుంది.

సీఐని కేటాయించాలి ...

పట్నం పోలీసుస్టేషన్‌కు నెలరోజు లుగా సీఐలేక కేసుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది. పలు సమ స్యల కోసమై పోలీసు స్టేషన్‌కు వెళ్లినా కూడా ఫలితం లేకుండా పోతున్నది. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌కు రోజుకు పదుల సంఖ్యలో కేసులు వచ్చే అవకాశమున్నందున వీటిని ఎప్పటికప్పుడు పరిష్కరించటం కోసం వెంటనే పట్నం పోలీసుస్టేషన్‌కు సీఐని కేటాయించాలి.

– చిలుకల బుగ్గరాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పరిగి, జనవరి 16 : సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెం కటయ్య కోరారు. రాష్ట్ర మహాసభల పోస్టర్లను గురువారం పరిగిలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలలో భాగంగా ఈనెల 25వ తేదీన నిర్వహించే బహిరంగసభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.డి.హబీబ్, సత్తయ్య, యాదయ్య, రఘురాం, శేఖర్, లాలయ్య, రమేశ్, మున్వర్, పాండు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

కులకచర్ల, జనవరి 16 : క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక ధారుడ్యానికి దోహదపడతాయని బీఆర్ఎస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్‌రెడ్డి అన్నారు. మరికల్ ప్రీమి యర్‌లీగ్ బహుమతుల ప్రదానంలో భాగంగా కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ప్రతి రోజు ఏదో ఒక రంగంలో తమకు నచ్చిన క్రీడను ఎంపిక చేసుకొని అందులో రాణించేందుకు క్రీడాకారులు కృషిచేయాలని సూచించారు. ఈ సంద ర్భంగా క్రికెట్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌కు మొదటి బహుమతికి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి రూ. పదివేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మరికల్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కొమ్ము శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సభ్యులు

కులకచర్ల, జనవరి 16 : మండలంలో ఎమ్మార్పీఎస్ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని కులకచర్ల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ అన్నారు. నూతనంగా ఎమ్మార్పీ ఎస్ అధ్యక్షుడిగా ఎన్నికైన అయనను మండల దళిత సంఘాల నాయకులు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి బైండ్ల బాలకృష్ణారావుతో పాటు ఎమ్మార్పీఎస్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కోశాధికారి శివ్వని చుక్కయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి నాగని వెంకట్‌రాములు, సలహాదారులు బైండ్ల రాంచందర్, కామునిపల్లి వెంక టయ్య, మాజీ అధ్యక్షుడు జెట్టిగాళ్ల వెంకటయ్య, నాగని బిచ్చయ్య, దొమ్మ బాబయ్య, దళిత సంఘాల అధ్యక్షుడు కర్రె నర్సింహులు, సభ్యులు నాగని పాపయ్య, కొమ్ము ఆంజనేయులు, డప్పు శ్రీనివాస్, వెంకటయ్య, అరుణ్, యాదయ్య, బాబు, నాగని మహేశ్, భాను, మురళి, ప్రవీణ్, నరేశ్, ఆజం, కృష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సుభాష్(ఫైల్)

పరిగి, జనవరి 16: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పరిగి మండలం గడిసింగాపూర్ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. దోమ మండలం కుమ్మ రికుంట తండా కు చెందిన కేతావత్ సుభాష్ గురువారం రాత్రి గడిసింగాపూర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన సుభాష్ అక్కడి కక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్యవివాహం పై కేసు నమోదు

తాండూరు రూరల్, జనవరి 16 : బాల్యవివాహం పై కేసు నమోదు చేసినట్లు కరణ్‌కోట ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపారు. తాండూరు మండలం, మల్కాపూర్ గ్రామంలో 15 ఏండ్ల అమ్మాయితో కడప జిల్లా, పులివెందుల మండలంలోని అమ్మపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్‌రెడ్డి (26)తో వివాహం జరిగింది. నరేశ్‌కుమార్, చైల్డ్‌లైన్ సభ్యులు చంద్రప్పల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

మాజీ మంత్రి పొన్నాల ఇంట్లో చోరీ

బంజారాహిల్స్, జనవరి 16: మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు లోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీ హిల్స్ రోడ్ నం.92లో నివాసం ఉంటున్న పొన్నాల లక్ష్మయ్య సతీమణి అరుణాదేవితో కలిసి ఈనెల 10న సమీపంలోని టీటీడీ ఆలయానికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. గుడి నుంచి వచ్చాక కాసేపటికి అరుణాదేవి బయటకు వెళ్లి మళ్లీ సాయంత్రం వచ్చింది. మరుసటిరోజు ఉదయం నిద్రలేచిన అరుణాదేవికి బెడ్ రూమ్ తలుపులు తెరిచి ఉన్న విషయం కని పించింది. బెడ్‌రూమ్‌లోని అల్మారాలో ఉండాల్సిన రూ.1.5లక్షల నగదు, బంగారు గాజులు, నెక్లెస్‌లు, ఇతర ఆభరణాలు మాయమయినట్లు తేలింది. ఈ మేరకు ఫిలింనగర్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసు కొని నిందితుల కోసం గాలింపు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

వినయ్‌భాస్కర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, స్టేషన్ సిబ్బంది

వెంగళరావునగర్, జనవరి 16: విధి నిర్వహ ణలో ఓ హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టే షన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టే బుల్ వినయ్ భాస్కర్(53) బుధవారం సాయంత్రం విధి నిర్వహణలో ఉండగా.. ఫిట్స్ వచ్చి కిందపడిపోయాడు. గమనించిన తోటి పోలీసు సిబ్బంది వెంటనే ఆయన్ని చికిత్స కోసం దవాఖానకు తరలించారు. అర్ధ రాత్రి మళ్లీ రెండోసారి గుండెపోటు రావ డంతో చికిత్స పొందుతూ ప్రాణాలు విడి చాడు. మృతుడు వినయ్ భాస్కర్‌ది ఏపీలోని బాపట్ల జిల్లా తెనాలి స్వస్థలం. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గురు వారం ఉదయం దవాఖానకు చేరుకున్న ఎస్ ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డీఐ గోపాల్, ఇతర సిబ్బంది వినయ్ భాస్కర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలి పారు. తక్షణ సాయంగా కోఆపరేటివ్ సొసైటీ నుంచి రూ.50,000, అంత్యక్రియల కోసం డిపార్ట్‌మెంట్ తరపు నుంచి మరో రూ.30,000లను వినయ్ భాస్కర్ కుటుం బసభ్యులకు ఇన్‌స్పెక్టర్ అందజేశారు.

అద్దెకున్న వ్యక్తికి మద్యం తాగించి.. ఓనర్ ఇంట్లో చోరీ

ఇద్దరు నిందితులు అరెస్టు 20 తులాల బంగారం, రూ.25లక్షల నగదు రికవరీ ఆర్ట్ అసిస్టెంట్ ఇంట్లో చోరీ కేసు ఛేదించిన బంజారా హిల్స్ పోలీసులు

నిందితులు దాసరి రక్షక్‌రాజ్, తిరుమల్‌రెడ్డి

బంజారాహిల్స్, జనవరి 16: : ఫేస్‌బుక్‌లో పరిచయం అయిన వ్యక్తికి మద్యం తాగించి అతడు అద్దెకు ఉంటున్న ఇంట్లో చోరీకి పాల్పడిన ఓ పాతనేరస్తుడిని బంజారా హిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరా ల్లోకి వెళ్తే.. సినిమాల్లో ఆర్ట్ డైరెక్షన్ విభా గంలో అసిస్టెంట్‌గా పని చేస్తున్న వీర వెంక టరమణ ఇందిరానగర్‌లో నివాసం ఉంటు న్నాడు. ఈయన బిగ్‌బాస్ గేమ్ షోతోపాటు ఇటీవల విడుదలైన గేమ్ ఛేంజర్ సినిమాకు సెట్టింగ్ పనులు చేశాడు. కాగా, సంక్రాంతికి భార్య, కుటుంబసభ్యులతో కలిసి వెంకట రమణ రాజమండ్రి సమీపంలోని సొంతూ రికి వెళ్లాడు. అయితే ఈనెల 13న అర్ధరాత్రి అతడి ఇంట్లో భారీ చోరీ జరిగింది. 20 తులాల బంగారం, రూ.25లక్షల నగదుతో పాటు ఇతర వస్తువులు చోరీ అయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న క్రైం పోలీసులు రంగం లోకి దిగారు.

డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బషీర్ అహ్మద్ నేతృ త్వంలో క్రైం సిబ్బంది స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా.. ఈనెల 13న రాత్రి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఇంట్లోకి వెళ్లి నట్లు తేలింది. సుమారు రెండు గంటల తర్వాత బైక్‌పై ఓ వ్యక్తి వెళ్లిపోతున్న దృశ్యాలు కనిపించాయి. బైక్ మీద వచ్చిన వారిలో ఓ వ్యక్తిని వెంకటరమణ ఇంట్లో అద్దెకు ఉంటున్న తిరుమల్‌రెడ్డిగా గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. చోరీ వ్యవహారం బయటపడింది. చోరీ చేసిన వ్యక్తి రహ్మత్‌నగర్ ఎస్‌పీఆర్ హిల్స్‌లో నివాసం ఉంటూ చెఫ్‌గా పనిచేస్తున్న దాసరి రక్షక్‌రాజ్(27) అనే పాతనేర స్తుడు అని తేలింది. స్వలింగ సంప ర్కుడిగా ఉన్న రక్షక్‌రాజ్ ఫేస్‌బుక్ ద్వారా వెన్నపూస తిరుమల్‌రె డ్డి(49)ని ఇటీవల పరిచయం చేసు కున్నాడు. సినిమా షూటింగ్స్‌లో జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తున్న తిరుమల్ రెడ్డితో వాట్సాప్ చాటింగ్‌లో రక్షక్‌రాజ్ ఈనెల 13న సాయి వైన్స్ వద్ద కలుద్దా మంటూ చెప్పాడు. ఇద్దరూ అక్కడ మద్యం సేవించి అనంతరం తిరుమల్‌రెడ్డి ఇంటున్న ఇంటికి వెళ్లి ఇద్దరూ పీకలదాకా మద్యం తాగారు. అనంతరం తిరుమల్‌రెడ్డి నిద్ర లోకి జారుకోగా.. రక్షక్‌రాజ్ ఫస్ట్‌ఫ్లోర్‌లోని వెంకటరమణ ఇంటి తాళాలు పగులగొట్టి 20 తులాల బంగారం, రూ.25లక్షల నగదు చోరీ చేసి ఉడాయించాడు. ఈ మేరకు ప్రధాన నిందితుడు దాసరి రక్షక్‌రా జ్‌ను, అతడికి సహకరించిన తిరుమల్‌రె డ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు చోరీ సొత్తును రికవరీ చేశారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీమతి ఎ.ఉషారాణి, భర్త: ఎ.ఉమామహేశ్వర రావు, వయస్సు: సుమారు 67 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, నివాసం: ప్లాట్ నెం. 136/137, ప్లాట్ నెం. 301, న్యూ వాసవీ నగర్, సాయిబాబా టెంపుల్, కార్ఖానా, తిరుమలగిరి, హైదరాబాద్-500 015. రెండు నెలల క్రితం నా క్లయింట్ కాగోరు కొనుగోలుదారుకు సదరు ప్లాట్ మరియు ప్లాట్ డాక్యుమెంట్లను చూపించుటకు ప్లాట్ డాక్యుమెంట్స్‌తో పైన తెలిపిన తన ప్లాట్ వద్దకు వెళ్లారు మరియు సదరు కాగోరు కొనుగోలుదారుకు సదరు డాక్యుమెంట్లను చూపించారు మరియు తిరిగి ఇంటికి వస్తుండగా మొయినాబాద్ బస్టాండ్ వద్దకు రాగానే తన ఆస్తి యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 2800 ఆఫ్ 2008 కలిగిన బ్యాగ్ కనిపించలేదని గ్రహించారు. ఎంతవెతికిననూ సదరు డాక్యుమెంట్ దొరకలేదు.

అందువల్ల, ఎవరికైనా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ దొరికినచో దిగువ సంతకందారుకు తిరిగి అప్పగించగలరు మరియు ఎవరికైనా సదరు డాక్యుమెంట్ దొరికినచో దానిని అసరాగా చేసుకొని సదరు ఒరిజినల్ డాక్యుమెంట్‌ను చూపించి పై సదరు ఆస్తికి సంబంధించి ఏవిధమైన లావాదేవీ కుదుర్చుకోరాదని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఎవరేని ఏదేని ఒప్పందం మరియు బయానా స్వీకరించినచో చట్టపరమైన చర్యలు తీసుకోబడును. ఇందునిమిత్తమే ఈ బహిరంగ ప్రకటన జారీ చేయబడినది.

బి.భూషన్ గుప్తా, అడ్వకేట్
ప్లాట్ నెం. 3, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్ కాంప్లెక్స్, బి.ఎన్.రెడ్డి నగర్, హైదరాబాద్-500 070